క్లుప్తంగా

గుడివాడ మున్సిపల్ కమిషనర్‌గా మురళీకృష్ణ



గుడివాడటౌన్: గుడివాడ మున్సిపల్ కమిషనర్‌గా వి.మురళీకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్య కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం గాలేరు–నగరి సుజల స్రవంతి ప్రాజెక్ట్ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్‌గా తిరుపతి యూనిట్‌లో విధులు నిర్వహిస్తున్న ఆయన గుడివాడకు బదిలీ అయ్యారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ శాఖ దీనిపై ప్రస్తుత మున్సిపల్ కమిషనర్ పీజే సంపత్‌కుమార్‌కు బదిలీ ఆదేశాలు జారీ చేయాల్సి ఉంది. ఆదేశాల అనంతరం మురళీకృష్ణ బాధ్యతలు స్వీకరించనున్నారు. గతంలో గుడివాడ మండల డెప్యూటీ తహసీల్దార్‌గా, తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన మురళీకృష్ణ పట్టణ ప్రజలకు చిరపరిచితులు.

ఆర్‌ఆర్‌ఆర్ టీమ్‌కు అభినందనలు

పామర్రు: ప్రముఖ దర్శకుడు రాజమౌళి దర్శకత్వంలో ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా నటించిన ఆర్‌ఆర్‌ఆర్ చిత్రంలోని నాటు నాటు పాటకు బెస్ట్ ఒరిజినల్ సాంగ్ అవార్డును గోల్డెన్ గ్లోబ్ అంతర్జాతీయ సంస్థ అందజేయటం హర్షణీయమని పామర్రు ఎస్పీ బాలు కల్చరల్ అసోసియేషన్, పామర్రు కళా పరిషత్‌ల అధ్యక్ష, కార్యదర్శులు సాపాటి బెనర్జీ, వీరంకి బుల్లెయ్య, ఎస్ త్రివిక్రమరావు, వెంకటరత్నం బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ చిత్రానికి పనిచేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు.

వలంటీర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెదపారుపూడి: మండలంలో ఖాళీగా ఉన్న రెండు వలంటీర్ల పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్లు ఎంపీడీఓ టి.సీతామహాలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ భూషణగుళ్ల సచివాలయంలో పరిధిలోని అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

క్రిస్టియన్లు ఐకమత్యంగా ఉండాలి

కైకలూరు: క్రిస్టియన్లు ఐకమత్యంగా ఉండాలని ఏపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మేడిది జాన్సన్ అన్నారు. కైకలూరు మన్నా చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాన్సన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులాలు, మతాలు, వర్గాలు చూడకుండా అర్హతే ప్రాతిపాదికన సంక్షేమ పథకాలు అందిస్తోన్నారన్నారు. అనంతరం ఎమ్మెల్యే డీఎన్నార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మన్నా చర్చి ఫాదర్ జారువా జ్యోతి, ఎస్కోలు ఫాస్టర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు అబ్రహం, క్రైస్తవ పెద్దలు ప్రభాకర్, గోట్రూ పాట్రిక్‌పాల్, పీవీ రత్నం, రాబర్ట్, ఆనంద్ పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు నెహ్రూనగర్‌లో వైఎస్సార్ బీమా పథకం కింద మృతుని కుటుంబానికి బుధవారం తక్షణ సాయం అందజేశారు. గ్రామంలో తోట ఆనందకుమార్(45) మంగళవారం విజయవాడలో చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎంపీడీఓ డి.శ్రీనివాస్ తెలిపారు. మృతుని భార్య తోట రజనీకి ఎంపీటీసీ పెనుమాల పూర్ణ కవిత రూ.10 వేలను మట్టి ఖర్చుల నిమిత్తం అందించారు. వెల్ఫేర్ అసిస్టెంట్ మౌనిక, వలంటీర్ అనిత పాల్గొన్నారు.

వైభవంగా కూడారై ఉత్సవం

పామర్రు: ధనుర్మాసంలో భాగంగా 27వ రోజున కూడారై ఉత్సవాన్ని పలు ఆలయాల్లో బుధవారం వైభవంగా నిర్వహించారు. నియోజకవర్గ కేంద్రమైన పామర్రులోని విష్ణాలయంలో ధనుర్మాసం సందర్భంగా విశేషంగా పూజలు చేశారు. 108 చిన్న గంగాళాలతో పాయసాన్ని వండి నివేదనలు చేశారు. రాపర్ల గ్రామంలోని గణ్యశ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలను చేసి భక్తులకు ప్రసాదాలను అందజేశారు. ఆలయ నిర్వాహకులు కాకర్ల బలరామమూర్తి, భక్తులు కె.శివయ్య, బి.బాలాకుమారి, బి.నవ్య పాల్గొన్నారు.

గుడివాడటౌన్: స్థానిక జగన్నాథపురం పాటిమీద వేం చేసి ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో కూడారై ఉత్సవం ఘనంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం మాట్లాడుతూ 27వ పాసరం నాడు అమ్మవారు గోదాదేవి స్వామి వారికి కూడారై ఉత్సవం నిర్వహిస్తారని దీనిని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమం నిర్వహించామన్నారు.

గడ్డివామి దగ్ధం

కైకలూరు: కుటుంబ కలహాల నేపథ్యంలో వరహాపట్నం గ్రామంలో మూడు ఎకరాల గడ్డివాము దగ్ధమైన ఘటనపై కైకలూరు రూరల్ పోలీసు స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. కైకలూరు నుంచి అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన వచ్చి మంటలను అదుపుచేశారు. సమీపంలో విద్యుత్ మెయిన్ వైర్లు ఉండటంతో అగ్నిమాపక సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రమాదంలో రూ.40 వేలు ఆస్తి నష్టం జరిగిందన్నారు. రూరల్ ఎస్‌ఐ చల్లా కృష్ణ మాట్లాడుతూ గ్రామానికి చెందిన బుసనబోయిన రామకృష్ణ చెరువు వద్ద గడ్డివామును ఉంచారన్నారు. అతని తమ్ముడి కుమారుడు బుసనబోయిన భాస్కరరావు కుటుంబ కలహాల నేపథ్యంలో గడ్డివాము తగలబెట్టినట్లు రామకృష్ణ ఫిర్యాదు చేశారన్నారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ అజెండా



వానపాములలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కైలే, నాయకులు

ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

వానపాముల(పెదపారుపూడి): అభివృద్ధి, సంక్షేమమే అజెండాగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగుతోందని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని వానపాముల గ్రామంలోని బీసీ ఏరియాలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి అందజేసిన సంక్షేమ పథకాలను వివరించి బుక్‌లెట్‌ను అందజేశారు. గ్రామంలో చిన్న, చిన్న సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, స్పందించిన ఎమ్మెల్యే వెంటనే సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

రూ.40 లక్షలతో జలజీవన్ మిషన్ పనులు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కుల, మత, వర్గ పార్టీలకు అతీతంగా సంక్షేమాన్ని ప్రజలకు అందించేందుకు వలంటీర్ల వ్యవస్థ తీసుకుని వచ్చి దేశానికే ఆదర్శంగా నిలిస్తున్నామన్నారు. సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి పాలనను ప్రజల ముంగిటకు తెచ్చి గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజాన్ని అందించారన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా రూ.40 లక్షల నిధులు మంజూరు కావటంతో ఎమ్మెల్యే కైలే పనులను ప్రారంభించారు. 300 ఇళ్లకు ఇంటింటికీ మంచినీటి కనెక్షన్ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గోగం సురేష్, ఎంపీటీసీలు జిజ్జువరపు రాజిమ్మ, చదలవాడ పద్మజ, సర్పంచ్‌లు పాతూరి రమేష్, గోళ్ల సోమేశ్వరరావు, పుణుకొల్లు శివరామప్రసాద్, అప్పికట్ల ఆశా జ్యోతి, స్థానిక పీఏసీఎస్ బ్యాంక్ అధ్యక్షుడు పల్లా అరవింద్, మాజీ జెడ్పీటీసీ మూల్పూరి హరీష, నాయకులు ఎలిసి డేవిడ్‌రాజు, పడాలి రామారావు, లంకపల్లి రాజేష్, మెండెం ఎలీయా, పాతూరి సాల్మన్, మూల్పూరి చంద్రశేఖర్, దొండపాటి రాంబాబు, ఆల రమేష్, దూడల నాగార్జున పాల్గొన్నారు.

నేడు జమిదింటకుర్రులో..

జమిదింటకుర్రు(పెదపారుపూడి): మండలంలోని జమిదింటకుర్రు గ్రామంలో గురువారం ఉదయం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ పుణుకొల్లు శివరామప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పాల్గొని ప్రభుత్వ పథకాలను వివరించడంతో పాటు స్థానిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు.

ఎన్నికల హామీలు పక్కాగా అమలు



పెరికెగూడెంలో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

ఎమ్మెల్యే డీఎన్నార్

మండవల్లి: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పక్కాగా అమలు చేయడంతో పాటు ఇవ్వని హామీలను నెరవేర్చిన ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని పెరికెగూడెంలో సర్పంచ్ పెరుమాళ్ల పద్మ, ఎంపీటీసీ పెరుమాళ్ల లక్ష్మీకాంతమ్మ ఆధ్వర్యంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. మూడేళ్లలో అందజేసిన ప్రభుత్వ పథకాలకు సంబంధించిన బ్రోచర్‌లను అందజేశారు.

అన్ని వర్గాలకు పథకాలు..

గడప గడపలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులకు ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. అన్ని వర్గాలకు అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందించి ప్రజలను స్థితిమంతులుగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తూ, ప్రజల జీవితాలను మార్చిన ఏకైక ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలుస్తారని డీఎన్నార్ పేర్కొన్నారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్(రాము), మండల పార్టీ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి చేబోయిన వీర్రాజు, బోనం శేషగిరి, పుట్టి సత్యనారాయణ, జంపన వీరబాబు, నాగదాసి థామస్, దారా రమేష్, బావిశెట్టి స్వామి, ముంగర మల్లిఖార్జునరావు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బేతపూడి యేసోబురాజు, పెరుమాళ్ల సత్యనారాయణ, జంగం రాందాసు, పెరుమాళ్ల కొండారెడ్డి, పి.పెదవెంకటేశ్వరరెడ్డి, రామకృష్ణారెడ్డి, ఆంజనేయులు, నాయకులు మాజీ ఎంపీపీ ముంగర గోపాలకృష్ణ, మాజీ సర్పంచ్ బలే నాగరాజు, ఎస్‌ఐ టి.రామకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ బొమ్మనబోయిన గోకర్ణ, హౌసింగ్ వర్క్స్ ఇన్‌స్పెక్టర్ లలిత పాల్గొన్నారు.

పశు సంరక్షణే పోటీల ధ్యేయం



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

గుడివాడటౌన్: ఒంగోలు జాతి పశువుల సంరక్షణే ధ్యేయంగా గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ఎడ్ల పోటీలు నిర్వహిస్తున్నారని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. గుడివాడ కే కన్వెన్షన్ నగర్‌లో 'ఎన్టీఆర్ 2 వైఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు జాతీయ స్థాయి పోటీలను ఆయన బుధవారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే అనిల్‌కుమార్ విలేకరులతో మాట్లాడారు. ఒంగోలు జాతి ఎడ్లను పోషించి, భావితరాలకు వాటి ప్రాముఖ్యతను తెలిపేందుకు కొడాలి నాని కృషిచేస్తున్నారని కొనియాడారు. ఈ పోటీల ద్వారా పశుపోషకులతో పాటు ఒంగోలు జాతి సంపదకు మేలు జరుగుతుందన్నారు. ఏటా సంక్రాంతిని పురస్కరించుకుని ఎడ్ల పోటీలు నిర్వహిస్తున్నారని, రైతులు సైతం ఆసక్తిగా వీటిలో పాల్గొని మద్దతుగా నిలవడం అభినందనీయమని అన్నారు. నందివాడ ఎంపీపీ పెయ్యల ఆదాం, మాజీ కౌన్సిలర్‌లు మాదాసు వెంకటలక్ష్మి, వీరిశెట్టి నరసింహారావు, చింతల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత పోలీస్ జట్టు



ముదినేపల్లిరూరల్: సంక్రాంతి పండుగ సందర్భంగా యువత జూదాల వైపు మరలకుండా స్థానిక ఎస్‌ఐ షణ్ముఖసాయి ఆధ్వర్యంలో మండలంలోని గురజలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలు బుధవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో 40 జట్లకు చెందిన క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకున్నారు. చివరి రోజైన బుధవారం ముదినేపల్లి పోలీసు జట్టు ఫైనల్ మ్యాచ్‌లో విజయం సాధించింది. ముదినేపల్లి, ముదినేపల్లి పోలీసు జట్ల మధ్య జరిగిన ఈ పోటీలో 12 ఓవర్లలో పోలీసు జట్టు 44 పరుగులు చేయగా ముదినేపల్లి జట్టు 43 పరుగులు చేసి ఆలౌట్ కావడంతో పోలీసుజట్టు ఒక్క పరుగు తేడాతో విజయం సాధించింది. ఈ జట్టుకు ఎస్‌ఐ షణ్ముఖసాయి కెప్టెన్‌గా వ్యవహరించగా ముదినేపల్లి జట్టుకు పెయ్యేరు సతీష్ కెప్టెన్‌గా వ్యవహరించారు. క్రికెట్ పోటీల్లోని విజేతలకు కైకలూరు సీతారామఫంక్షన్ హాల్‌లో ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ, స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) గురువారం బహుమతులు అందజేస్తారని ఎస్‌ఐ తెలిపారు.

పేదలకు గూడు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయం

జిల్లా హౌసింగ్ పీడీ సూర్యనారాయణ



జగనన్న లేఅవుట్‌లో వసతులపై సిబ్బందికి సూచనలిస్తున్న సూర్యనారాయణ

గుడివాడరూరల్: పేదలకు గూడు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ జి.వి.సూర్యనారాయణ తెలిపారు. మండలంలోని రామనపూడి గ్రామ సచివాలయ పరిధిలోని జగనన్న లేఅవుట్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగనన్న లేఅవుట్లలో లబ్ధిదారులకు సకల సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. లబ్ధిదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా గృహాలు నిర్మించుకునేందుకు అవసరమైన చర్యలను చేపడుతున్నామని చెప్పారు. రహదారులు, ఇతర మౌలిక వసతుల కల్పనకు ఇప్పటికే చర్యలు తీసుకున్నామన్నారు. అధికారులు సైతం క్షేత్రస్థాయిలో జరిగే పనులపై శ్రద్ధ వహించి జగనన్న లేఅవుట్లలో వసతుల కల్పనపై దృష్టి సారించాలని సూర్యనారాయణ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆర్వీ కృష్ణ, హౌసింగ్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులు, సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అలరించిన సంక్రాంతి సంబరాలు



జాగృతి స్కూల్‌లో వేడుకల్లో ఎమ్మెల్యే డీఎన్నార్



అడ్డాడలో ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న సర్పంచ్ త్రినేత్రి, హరికిరణ్

కైకలూరు: సంక్రాంతి సంబరాలు బుధవారం పాఠశాలల్లో ఉత్సాహంగా జరిగాయి. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) పలు పాఠశాలల్లో జరిగిన సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు. భోగి మంటలు, హరిదాసులు, గంగిరెద్దుల విన్యాసాలు, ముగ్గుల పోటీలు అందిరిని ఆలరించాయి. కైకలూరు ఓరియంటల్ స్కూల్, నేషనల్, శ్రీ చైతన్య టెక్నో స్కూల్, జాగృతి, రవీంద్రభారతి స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ఓరియంటల్ స్కూల్‌లో ముగ్గుల పోటీలలో విజేతలకు పూర్వ విద్యార్థి, విశ్రాంత ఎంపీడీవో గిరిజ బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, ఓరియంటల్ స్కూల్ హెచ్‌ఎం కట్టా విష్ణుమూర్తి, తులసి పూర్ణ, తలారి జాన్, పానెం జైకిషోర్‌బాబు, కరస్పాండెంట్ గురజాడ చంద్రమోహన్, ప్రిన్సిపాల్ సురేంద్ర, రమ్య పాల్గొన్నారు.

అడ్డాడలో ముగ్గుల పోటీలు..

పామర్రు: మన సంస్కృతీ సంప్రదాయాలను మనమే కాపాడుకోవాలని గ్రామ సర్పంచ్ పామర్తి త్రినేత్రి అన్నారు. మండల పరిధి అడ్డాడ గ్రామపరిధిలో మండల స్థాయి ముగ్గుల పోటీలను ఆమె బుధవారం ప్రారంభించారు. మండల పరిధిలోని 25 గ్రామాల నుంచి 40 మందికి పైగా మహిళలు పాల్గొని, ముగ్గులు వేశారు. విజేతలకు గురువారం బహుమత్రి ప్రధానం చేస్తామన్నారు. అడ్డాడ పీఏసీఎస్ అధ్యక్షుడు బలసు హరికిరణ్, గ్రామస్తులు పామర్తి వెంటేష్ తదితరులు పాల్గొన్నారు. గ్రామంలోని ఆసిస్సీ హైస్కూల్‌లోని విద్యార్థులకు సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించామని ప్రిన్సిపాల్ సిస్టర్ సునీ చాకో తెలిపారు. 30 మంది విద్యార్థులు పాల్గొని ముగ్గులు వేశారు. పీఈటీ మట్టా గ్లాడిసన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగు సంప్రదాయానికి ప్రతిబింబం...

గుడ్లవల్లేరు: సంక్రాంతి పండుగ తెలుగు సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతిబింబమని లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ వైపీసీ ప్రసాద్ అన్నారు. గుడ్లవల్లేరు సంతరోడ్డులోని శ్రీ సాయి విద్యానికేతన్‌లో ఆ విద్యాసంస్థ అధినేత సింగంశెట్టి ఆదినారాయణ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. విద్యార్థులు తెలుగు సంప్రదాయ వేషధారణల్లో ఆకట్టుకున్నారు. అనంతరం విద్యార్థులకు ప్రసాద్ చేతుల మీదుగా ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంప్రదాయాలను కాపాడుకుందాం

ముదినేపల్లిరూరల్: తెలుగు సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నేత దూలం ఆది వినయ్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక సాయిరాం డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సంక్రాంతి సంబరాలను వారు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కళాశాల విద్యార్థులు వివిధ వేషధారణలతో అలరించారు. తహసీల్దార్ కె.శ్రీనివాస్, జెడ్పీటీసీ ఈడే వెంకటేశ్వరమ్మ, హౌసింగ్ బోర్డు డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీ రాచూరి రాధా, సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు, నాయకులు నిమ్మగడ్డ భిక్షాలు, శీలం రామకృష్ణ, బొర్రా శేషుబాబు, జాస్తీ చంటి, రాచూరి కుమార్, సాక్షి సాయి, కొల్లి నాని, బేతు రాజా, కళాశాల కరస్పాండెంట్ యర్రా శ్రీరాములు పాల్గొన్నారు.

ఆక్వా జోన్ సర్వేకు రైతులు సహకరించాలి

కైకలూరు: ఆక్వా రైతులకు మేలు చేసే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఆక్వా జోన్ సర్వేకు రైతులందరూ సహకరించాలని పల్లెవాడ సర్పంచ్ దుట్టా మణి కోరారు. గ్రామ మత్స్యశాఖ సహాయకుడు(వీఎఫ్‌ఏ) హరీష్ ఆధ్వర్యంలో జరిగిన గ్రామ సభలో సర్పంచ్ మాట్లాడుతూ ఆక్వా జోన్ పరిధిలోకి చెరువుల సర్వే నంబర్లు, మిగులు విస్తీర్ణం సిబ్బంది నమోదు చేస్తారని పేర్కొన్నారు. ఆక్వా రైతులందరూ తప్పనిసరిగా మత్స్యశాఖ నుంచి లైసెన్సులు పొందాలని అన్నారు. ఉపసర్పంచ్ తోట జగన్ మోహన్, పీఏసీఎస్ అధ్యక్షుడు గంగుల అశోక్, పంచాయతీ సెక్రటరీ జంపన కుమారస్వామి, గ్రామపెద్ద దుట్టా మోహనరావు పాల్గొన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

కైకలూరు: మండవల్లి మండలం పెనుమాకలంక గ్రామంలో పొదల మధ్య పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను బుధవారం అదుపులోకి తీసుకున్నామని సెబ్ సీఐ ఎస్.రాంబాబు చెప్పారు. వీరి వద్ద నుంచి రూ.1,670 నగదు స్వాధీనం చేసుకుని మండవల్లి పోలీసు స్టేషన్‌కు కేసును బదిలీ చేశామన్నారు.

ఆకట్టుకున్న త్యాగరాజ సంగీత కచేరి

గుడివాడటౌన్: స్థానిక సత్యనారాయణపురంలోని ఉపద్రష్ట సత్రంలో శ్రీ త్యాగరాజ స్వామి వారి 176వ ఆరాధనా మహోత్సవాలను పురస్కరించుకుని జరిగిన సంగీత కచేరి ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. తెనాలికి చెందిన ములుకుట్ల బ్రహ్మనందశాస్త్రి త్యాగరాజస్వామి వారిపై రచించిన ప్రసంగాలను వివరించారు. సంగీత విద్యాంసులు పోపూరి శామ్ సుందర్, గజ్జెల సతీష్‌బాబు, రఘునాథ్, శ్రీదేవి ప్రవల్లిక, వైష్ణవి, శివరంజని, ప్రణతి, సముద్యత, షణ్ముఖప్రియ, నాగనందిని, రాధిక, సుభద్ర, శ్యామల, విజయలక్ష్మి, మల్లేశ్వరమ్మ, బాలాకుమారి, వర్ధని కచేరీ చేశారు. వయొలిన్ నాగేశ్వరరావు, సుబ్రహ్మణ్యరాజు, మృదంగం అరవింద్, సూర్య, శాక్సోఫోన్ తుమ్మడి భద్రయ్య, సహా వాయిద్య విద్యాంసులుగా పాల్గొన్నారు.

పంచాయతీ ఉద్యోగుల సంఘ కార్యవర్గం ఎన్నిక

కైకలూరు: ఏపీ పంచాయతీరాజ్ మినిస్ట్రీరియల్ ఉద్యోగుల కైకలూరు సమితి యూనిట్ ఎన్నికలు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగాయి. ఎన్నికల అధికారిగా ఆర్.సాంబశివరావు వ్యవహరించారు. అధ్యక్షుడిగా కె.రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు సీహెచ్‌వీ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి ఎంపీవీ చిదంబరరావు, సంయుక్త కార్యదర్శి టి.అప్పన్న, కోశాధికారి అబ్దుల్ వహాబ్, జిల్లా కౌన్సిలర్ సభ్యులుగా కె.నాగేశ్వరరావు, ఎంఆర్‌వీ. రంగారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

భక్తిశ్రద్ధలతో గో పూజ

పామర్రు: గ్రామంలోని విష్ణాలయంలో గో మాతకు విశేషంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. తొలుత గోమాతకు ప్రత్యేకంగా పసుపు, కుంకుమ, గంధం తదితరాలతో పూజలు చేసి తర్వాత గోవుకు ఇష్టమైన పదార్థాలను నివేదనగా సమర్పించారు. భక్తులు గోమాతకు నూతన వస్త్రాలను సమర్పించి అలంకరించి, సీమంతం నిర్వహించారు. అనంతరం సూడి గోమాతకు సూడిదలుగా పలు రకాల మిఠాయిలను పెట్టి పూజలు చేశారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

తహసీల్దార్లు

గుడ్లవల్లేరు: కోడిపందేలను నిర్వహించటం చట్టరీత్యా నేరమని తహసీల్దార్ అబ్దుల్ రెహ్మాన్ మస్తాన్ చెప్పారు. గుడ్లవల్లేరు గ్రామ సచివాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఎంపీడీఓ డి.శ్రీనివాస్, ఈఓపీఆర్డీ వి.దిలీప్‌కుమార్, ఏఎస్‌ఐ సీహెచ్.సారథి, గ్రామ కార్యదర్శి ఏజెఎల్ నరసింహారావు పాల్గొన్నారు.

గుడివాడటౌన్(నందివాడ): నందివాడ మండలంలో నిషేధ క్రీడలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ రవికాంత్ హెచ్చరించారు. మండల కార్యాలయంలో ఎంపీడీఓ బీవై విష్ణుప్రసాద్, ఎంపీపీ పెయ్యల ఆదాం సమక్షంలో బుధవారం గ్రామ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో జూదాలు జరగకుండా చూడాలన్నారు. ఈఓపీఆర్డీ జి.శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శులు, ఏఎస్‌ఐ ఆంజనేయులు పాల్గొన్నారు.

గుడివాడరూరల్: జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కె.ఆంజనేయులు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పోలీస్‌శాఖ, మండల స్థాయి అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈఓపీఆర్డీ డి.వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, మహిళా పోలీసులు, ఏఎస్‌ఐ వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనుల ప్రారంభం

మండవల్లి: జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక లే అవుట్–2లో పైప్‌లైన్ పనులను ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్(రాము) బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. తాగునీరు, ఇళ్లు మంజూరు చేస్తూ బడుగు, బలహీన, అట్టడుగు వర్గాల ప్రజల అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారన్నారు. సర్పంచ్ మెండా రూన్సీ, చేబోయిన వీర్రాజు, మెండా సురేష్, బొమ్మనబోయిన గోకర్ణ, వార్డు సభ్యులు జి.సత్యనారాయణరాజు, బుంగా రాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

తోట్లవల్లూరు: పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక ఉల్లాసంగా, ఉత్సాహంగా సాగింది. మండలంలోని పెనమకూరు జెడ్పీ పాఠశాలలో 1988–89లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆనందోత్సాహాల నడుమ బుధవారం జరిగింది. 34 ఏళ్ల క్రితం తాము చదువుకున్న పాఠశాల, నడయాడిన తరగతి గదులను చూసి పూర్వ విద్యార్థులు మురిసిపోయారు. ఆనాటి స్మృతులను మననం చేసుకుంటూ ఒకరి గురించి ఒకరు విశేషాలు తెలుకుంటూ ఆహ్లాదంగా గడిపారు. అందరూ కలిసి భోజనాలు చేయటంతో పాటు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు పామర్తి వెంకట్రామయ్య, పాల్, వెంకటేశ్వరరావు, తులసిని ఘనంగా సన్మానించి జ్ఞాపికలు బహూకరించారు. కార్యక్రమానికి ప్రత్యేక అతిథులుగా జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, సర్పంచ్ నందేటి గంగాభవాని, ఎంపీటీసీ సభ్యుడు మరీదు మధుబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు బోలెం శ్రీనివాసరావు హాజరయ్యారు. కార్యక్రమాలను పూర్వ విద్యార్థులు పర్యవేక్షించారు.

ఫుట్‌పాత్ బ్రిడ్జి ప్రారంభం



వంతెనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: కైకలూరు కాల్వపై ఎంపీ నిధులు రూ.5 లక్షలతో నిర్మించిన ఫుట్‌పాత్ బ్రిడ్జిని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు బుధవారం ప్రారంభించారు. ఎన్జీఓస్ కాలనీ నుంచి వంతెన చేరడానికి అవసరమైన రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే నిధులు రూ.5 లక్షలు కేటాయిస్తున్నట్లు ఆయన తెలిపారు. దీంతో కాలనీవాసులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, జెడ్పీటీసీ కురేళ్ల బేబీ, సర్పంచ్ దానం మేరి నవరత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ దండే పుష్పలత, వైస్ చైర్మన్ కొండరాజు, వైస్ ఎంపీపీ జహీర్, మండల సర్పంచుల సంఘ అధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భత్రాజు శివాజీ, వార్డు సభ్యులు కేవీఎస్‌ఎం నాయుడు, పంచాయతీరాజ్ డీఈఈ సురేష్ పాల్గొన్నారు.